క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన

బొబ్బిలి: స్థానిక గొల్లపల్లి వేణుగోపాలస్వామి మున్సిపల్ హైస్కూల్‌లో ఇటీవల జరిగిన పదో తరగతి ప్రీఫైనల్ ఇంగ్లిష్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సిబ్బంది మంగళవారం అభినందించారు. ఇదే స్ఫూర్తి కొనసాగించి, పబ్లిక్ పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశాల్లోని నిర్ణయాల అమలుకు ప్రాధాన్యమివ్వాలి



సూచనలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఆస్పత్రి అభివృద్ధి సలహా సంఘ సమావేశాల్లో సభ్యులు తీసుకున్న నిర్ణయాలు అమలు చేసేందుకు ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని ఆస్పత్రిలో మంగళవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి సలహా సంఘ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలుపై ఆరాతీశారు. త్వరితగతిన నిర్ణయాల అమలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారి జి.శశిభూషణరావు, సభ్యులు టి.బంగారురాణి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 73 మంది ఎంపిక

బొబ్బిలి: పట్టణంలోని రాజా కళాశాలలో హెటిరో డ్రగ్స్ కంపెనీ మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 73 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ వీరేంద్రకుమార్ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారిలో 42 మంది ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సు చేసిన వారు కాగా, మిగతా 31 మంది బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సు చేసిన వారు ఉన్నారన్నారు. సదరు విద్యార్థులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శరత్‌కుమార్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.

ప్రారంభానికి సిద్ధంగా కళాశాల భవనం



రంగులద్దుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

రాజాం: మండలంలోని గురవాం గ్రామంలో ఉన్న కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం) ఆవరణలో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం ప్రారంభానికి సిద్ధమైంది. రూ.1.6 కోట్ల నాడు–నేడు నిధులతో భవన నిర్మాణాలు జరిగాయని ఏఈ జగదీష్ తెలిపారు. ప్రస్తుతం కేజీబీవీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు తరగతులు జరుగుతున్నాయని, ఈ భవనాలు ప్రారంభమైన వెంటనే విద్యార్థులను ఇక్కడికి తరలిస్తామన్నారు.

నేడు సంత పునఃప్రారంభం

బొబ్బిలి: స్థానికంగా జరిగే సంతను బుధవారం పునఃప్రారంభించనున్నారు. కోవిడ్ విపత్తు సమయంలో ఈ సంత నిర్వహణను నిలిపివేశారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సూచనలతో సంత తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు ఇటీవల తెలిపిన విషయం తెలిసిందే. గతంలో సంత నిర్వహించే ప్రాంతంలో కాకుండా ఏఎంసీ ఆవరణలోనే సంతను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



ఎంపీపీ జ్ఞానదీపికను సన్మానిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గజపతినగరం రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. మండల కేంద్రంలోని ఎన్‌జీఓ కార్యాల య ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ నాగరికత ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బాల్యవివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్ట డంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలకపాత్ర పోషించాలని చెప్పారు. నేడు మహిళలు ఉద్యోగాలు, రాజకీయాల్లో పురుషులతో సమానంగా నిలుస్తున్నారన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి మాట్లాడుతూ శుభ్రత, పరిశుభ్రతతో పాటు, బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌ల పై కిశోర బాలికలకు, మహిళలకు దిశ చట్టం, యాప్‌పై అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం ఎంపీపీ జ్ఞానదీపిక, పీడీ శాంతకుమారిని ఐసీడీఎస్ పీఓ నాగమణి, సూపర్‌వైజర్లు రమాదేవి, హైమావతి, పురిటిపెంట సర్పంచ్ రాములమ్మ, అంగన్ వాడీ సిబ్బంది సన్మానించారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



పెద్దశిర్లాంలో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో రూ.23 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనంతో పాటు, మరో రూ.3.46 లక్షలతో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాన్ని వారు కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో తొలుత ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగనన్న తపన అని, దానికోసమే ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రతిపక్ష నేత హోదాలో చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో ఆయన ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. మరోవైపు పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడుతూనే ప్రతీ గ్రామంలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. అంతేకాకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. ప్రతీ గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి, ప్రజలకు విశేషమైన సేవలందిస్తున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా, ఏ ఒక్క పథకం కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇంత చేసిన తర్వాత కూడా టీడీపీకి చెందిన జన్మభూమి కమిటీలు సూచించిన వారికే లబ్ధి జరిగేదన్నారు. ఒకసారి అప్పటి టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కూడా రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే ప్రధాన అజెండాగా సీఎం జగనన్న పాలన చేశారన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారానే సాధ్యమైందన్నారు. గ్రామంలోని సచివాలయాలతో ఉన్న ఊరిలోనే ఉచితంగా ప్రభుత్వ సేవలు, రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, సాగు సలహాలు, సూచనలు, వెల్‌నెస్ సెంటర్‌ల ద్వారా సకాలంలో వైద్యసేవలు అందించడం జరుగుతోందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దన్నారు. సీఎం జగనన్నకు అండగా నిలవాలని, మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ లెంక రాంబాబు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, చిన్నశిర్లాం సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు, ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్ రాములమ్మ, ఏవో జి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

- డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన



డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భావనను సత్కరిస్తున్న జీఎంఆర్‌వీఎఫ్, నాబార్డు ప్రతినిధులు

రాజాం: మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. స్థానిక జీఎంఆర్ ఐటీ కళాశాలలో నాబార్డ్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. మహిళలకు చదువు, పెళ్లి, పిల్లలు వంటి అంశాల్లో స్వేచ్ఛ ఉండాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా మహిళలకు సమాన గౌరవం లభించడమే నిజమైన సమానత్వమన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులపై మహిళలకు అవగాహన ఉండాలన్నారు. సమాజంలో ఎదురయ్యే సవాళ్లను మహిళలు ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని కలిగి ఉండాలన్నారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలంటే వ్యాపార రంగాల్లో కూడా రాణించాలని తెలిపారు. సమాజ సేవలో భాగంగా మహిళా సాధికారతపై పని చేస్తున్న జీఎంఆర్ వీఎఫ్, నాబార్డు సంస్థను ఆమె అభినందించారు. అనంతరం జీఎంఆర్ వీఎఫ్, నాబార్డు సంయుక్త సంస్థలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అంతకు ముందు శిక్షణ అంశాలపై ఆరాతీసి, స్వయంగా పరిశీలించారు. అనంతరం డీసీఎంఎస్ చైర్‌పర్సన్‌ను జీఎంఆర్ వీఎఫ్, నాబార్డు ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ డెవలప్‌మెంట్ అధికారిణి సుధ, జీఎంఆర్ కేర్ వైద్యులు శ్యామలాంబ, నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ నాగార్జున, జీఎంఆర్ జనరల్ మేనేజర్ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండుపూటలా పనిచేయండి



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో సాయిరాం

రాజాం: ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న వారంతా రెండుపూటలా పనిచేయాలని ఏపీవో కె.సాయిరాం సూచించారు. మండలంలోని పొగిరి గ్రామంలో ఉన్న పెద్ద చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మస్తర్లు పరిశీలించి, పనిలోకి వచ్చిన వారికి మాత్రమే మస్తరు వేయాలని తెలిపారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో మ్యాపింగ్ పరిశీలన

రాజాం: మండలంలోని అంబకండి, సోమరాజుపేట గ్రామాల్లో మంగళవారం జరిగిన పల్స్‌పోలియో మ్యాపింగ్ కార్యక్రమాన్ని వైద్యాధికారి ఎస్.చలమయ్య మంగళవారం పరిశీలించారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశమై, పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణపై ఆరాతీశారు. మండలంలో శత శాతం మేర కార్యక్రమం పూర్తయినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలో ఆదివారం నుంచి నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఐదేళ్ల వయసు లోపు ఉన్న 3,609 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. సోమ, మంగళవారాల్లో ఇంటింట సర్వే చేసి మరీ మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు.

ఇంటర్ విద్యార్థిని డిబార్

వంగర: మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థిని డిబార్ అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కొరటాన నారాయణరావు తెలిపారు. మంగళవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష జరగ్గా, డీఈసీ సభ్యులు ఎం.సత్యనారాయణ, రామకృష్ణలు పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఆ సమయంలో వంగర కేజీబీవీకి చెందిన విద్యార్థిని వద్ద స్లిప్పు గుర్తించి, డిబార్ చేశారు. మిగిలిన పరీక్షలకు సదరు విద్యార్థినిని అనుమతించడం లేదని స్పష్టం చేశారు.

అధిక మార్కుల సాధనకు ప్రత్యేక సంచిక



ఇంగ్లిష్ పరీక్ష ప్రత్యేక సంచిక విడుదల చేస్తున్న డెల్టా అధ్యక్షుడు విజయమోహనరావు, ఉపాధ్యాయులు

తెర్లాం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేందుకు తాను రూపొందించిన ఇంగ్లిష్ పరీక్షకు సంబంధించిన ప్రత్యేక సంచిక ఎంతగానో దోహదపడుతుందని జిల్లా ఆంగ్ల భాషోపాధ్యాయుల సంఘం(డెల్టా) అధ్యక్షుడు, నందబలగ హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మింది విజయమోహనరావు అన్నారు. మండలంలోని నందబలగ హైస్కూల్‌లో ఆయన రూపొందించిన ఇంగ్లిష్ పరీక్ష ప్రత్యేక సంచిక మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులంతా ఈ సంచిక తీసుకుని, తప్పనిసరిగా చదవాలన్నారు. సంచిక కావాల్సిన వారు ఫోన్ నంబర్ 9440744741ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సాంబశివ, ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి, పింఛన్ అందజేత



రాజాం సిటీ: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సూర్యనారాయణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఈశ్వరరావు

రాజాం సిటీ: శ్రీకాకుళం దగ్గరున్న రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన గిరిజాల సూర్యనారాయణకు వలంటీర్ ఈశ్వరరావు ఆస్పత్రికి వెళ్లి మరీ మంగళవారం పింఛన్ అందజేశారు. ఈ మేరకు సదరు వలంటీర్ సేవలను ఎంపీడీవో శంకరరావు, సచివాలయ సిబ్బంది అభినందించారు.

బాడంగి: మండల వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీ 99 శాతం మేర పూర్తయినట్లు ఎంపీడీవో ఆంజనేయులు మంగళవారం తెలిపారు. మండలంలో మొత్తం 8,677 పింఛన్‌దారులు ఉండగా, 8,614 పింఛన్లు ఇప్పటివరకు అందించామన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

రేగిడి: మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడువలస, పెద్దశిర్లాం, చిన్నశిర్లాం, ఉనుకూరు గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులతో చాలాకాలంగా పరిష్కారం కాని సమస్యలు పరిష్కారమవుతున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాడంగి: మండలంలోని డొంకినవలస రైల్వేస్టేషన్ నుంచి పిండ్రంగివలస వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రోడ్డు చదును పనులు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చొరవతో విడుదలైన రూ.1.30 కోట్ల నిధులతో ఈ పనులు చేస్తున్నారు.



రేగిడి: వన్నలిలో కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు



బాడంగి: నిర్మాణ దశలో డొంకినవలస రైల్వేస్టేషన్-పిండ్రంగివలస రోడ్డు



రేగిడి: పెద్దశిర్లాం ప్రధాన వీధిలో నిర్మించిన సీసీ కాలువను పరిశీలిస్తున్న అధికారులు

బిందుసేద్యంతో బహుళ ప్రయోజనాలు

- ఏపీఎంఐపీ జిల్లా పీడీ లక్ష్మీనారాయణ



రామభద్రపురం: కొండకెంగువలో బిందుసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ జిల్లా పీడీ లక్ష్మీనారాయణ

రామభద్రపురం: బిందు, తుంపర సేద్యంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఏపీఎంఐపీ(ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్) జిల్లా పీడీ లక్ష్మీనారాయణ రైతులకు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో బిందుసేద్యానికి రైతులకు రాయితీపై అందించిన పరికరాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిందు, తుంపరసేద్యం ద్వారా సాగునీరు ఆదా కావడంతో పాటు పంటల దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. ఈ ఏడాది జిల్లాలో 1200 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యానికి గాను రూ.6.80 కోట్లతో రాయితీపై పరికరాలు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 500 హెక్టార్ల వరకు బిందు, తుంపర్ల సేద్యం చేపట్టగా, ఆయా పరికరాలకు ప్రభుత్వం రూ.3.80 కోట్లు ఇవ్వగా రూ.2.09 కోట్ల మేర రాయితీ ఇచ్చిందన్నారు. అన్ని వర్గాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో ఈ పరికరాలు అందిసామన్నారు. వేరుశనగ, నువ్వులు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు తుంపర సేద్యానికి అనువైన పంటలన్నారు. మామిడి, జీడిమామిడి, కొబ్బరి, పామాయిల్, సపోటా, జామ, చెరుకు, పత్తి, మల్బరి, కూరగాయలు బిందుసేద్యానికి అనువైన పంటలన్నారు. ఉద్యాన పంటల సాగుపై సాంకేతిక, విస్తరణ పథకాల అమల్లో పారదర్శకత కోసం, అలాగే బిందుసేద్య పరికరాలు అమర్చిన తర్వాత పరికరాల పనితీరులో ఏమైనా సమస్య ఉంటే పరిస్కారానికి ఫోన్ నంబర్ 18004252960ను సంప్రదించాలని కోరారు.

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో బిందు, తుంపర సేద్యానికి ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించిన పరికరాలను ఏపీఎంఐపీ జిల్లా పీడీ లక్ష్మీనారాయణ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన బిందు, తుంపర సేద్యానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, ఆయా సేద్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 40 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం ద్వారా పంటల సాగును లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు జగన్మోహనరావు

రేగిడి: రాష్ట్రంలో ఇప్పుడున్న సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు అన్నారు. మండలంలోని పెద్దశిర్లాం, చిన్నశిర్లాం, ఏవీపురం, అంబాడ గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశమైన ఆయన రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. పార్టీకి చెందిన ప్రతిఒక్కరూ ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని ఇంటింటికీ వివరించాలన్నారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రతీ వ్యక్తి ఓటు వైఎస్సార్ సీపీకే పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, సర్పంచ్‌లు వెంకటినాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన నేతలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్

రాజాం: విశాఖపట్నం విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు రాజాం నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు ఎన్నికల ముందు అనుసరించాల్సిన వ్యూహాలపై తమ అభిప్రాయాలు తెలిపామన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ నేతలు దవళేశ్వరరావు, నరేంద్ర తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

రేగిడి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు జరగకుండా చర్యలు చేపట్టాలని రాజాం ఐసీడీఎస్ పీవో పి.కనకదుర్గ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, బాలికల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశమైన ఆమె బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు బాల్య వివాహాలను ప్రోత్సహించకుండా చూడాలని, 18 ఏళ్ల వయసు దాటిన తర్వాతనే ఆడపిల్లలకు వివాహం చేయాలని తెలిపారు. బాల్యవివాహాలు నిర్వహించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్యామలాకుమారి, తహసీల్దార్ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతో నెరవేరిన సొంతింటి కల



రిజిస్ట్రేషన్ చేసిన ఇంటిపత్రాలు అందుకున్న వారితో సర్పంచ్ రమేష్‌నాయుడు

రేగిడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో ప్రతీ పేదవాడి సొంతింటి కల నెరవేరిందని సర్పంచ్ నవలాపురపు రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని సోమరాజుపేట గ్రామసచివాలయం వద్ద నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి స్థలాలు పొందిన 11 మందికి రిజిస్ట్రేషన్ చేసిన ఇంటిపత్రాలు మంగళవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రిజిస్ట్రేషన్ చేసిన పత్రాల ద్వారా ప్రభుత్వం అందించిన స్థలంపై సర్వహక్కులు లబ్ధిదారుడికి ఉంటాయని, ఆపద సమయంలో వీటిని బ్యాంకుల్లో పెట్టి, రుణాలు కూడా పొందవచ్చని తెలిపారు. అన్నివర్గాల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎస్.నర్సింహఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లస్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇంటిపత్రాలను మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ చేతులమీదుగా మంగళవారం అందజేశారు.

సన్మానం

బాడంగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన హెచ్‌డీటీ చిన్నారావును మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజారావు సదరు హెచ్‌డీటీ సేవలను ప్రశంసించారు. మండలంలో భూముల రీసర్వే సకాలంలో సక్రమంగా జరగడంలో చిన్నారావు కృషి అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్ కూడా పనిచేసి, మంచి ఉద్యోగిగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.